# ట్రాప్...



దూరి నరసింహారెడ్డి

# ట్రాప్...

## పసి పిల్లలతో .. ఛీ... ఛీ!

**యాభై సంవత్సరాలు దాటిన కొందరు వ్యక్తులకు చిన్న చిన్న అమాయక సీతాకోక చిలుకల్లాంటి (12 - 13 సంవత్సరాల మధ్య వయసుగల) పిల్లలపై మోజు ఉంటుంది.**

**కొందరు శాస్త్రజ్ఞుల నివేదికల కారణంగా ఇలా ఎందుకంటే -**

చిన్నమ్మాయిలకు శారీరకంగా కొద్దిగా మాత్రమే ఎదుగుదల వుంటుంది. అప్పుడప్పుడే వికసిస్తున్న వయసు. వాళ్లకంటూ ఏమీ సెక్స్ కోరికలుండవు. శారీరకంగా బలహీనులైన ముసలి పీనుగులు వాళ్లను అనుభవిస్తే వాళ్ల బలహీనత బయటపడదు.

రెండో విషయం - వీళ్ల కున్న భారీ రాక్షస కాయంతో చిన్న సుకుమారమైన చిన్నారులపై వాళ్ల ఆధికత్యను చూపి ఎంజాయ్ చేస్తారు.

చిన్నారి పాపలను వలపన్ని తార్చే బ్రోకర్లకు ఈ రోజుల్లో నగరాల్లో ఎంతో గిరాకీ వుంది.

ఈ విషయం ఓసారి రైలు ప్రయాణంలో వరదరాజన్ - (ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్, చెన్నయ్) గారు చెప్పారు. ఆయన ఒక సర్వే చేసినప్పుడు ఎదురైన కొన్ని సంఘటనలను వివరించారు.

చిన్న పిల్లల్ని సప్లై చేసేందుకు డే అండ్ నైట్ సర్వీస్ ఇచ్చే ప్రత్యేక టీములు వున్నాయని విన్న నాకు కళ్లు తిరిగినంత పనైంది. వాటిలో కొన్ని మీ ముందుంచుతున్నాను...

మంచి వర్షం పడుతున్న రాత్రి.

చిన్న పిల్లల్ని సప్లై చేసే ఓ ఆడ బ్రోకర్ వద్ద మామూలు కస్టమర్‌లా పరిచయం చేసుకున్నాను. అమ్మాయి కావాలని అడిగాను.

నన్ను ఓ కార్లో ఓ వీధిలోకి తీసుకెళ్లింది.

వీధి చివర కారాపి కొన్ని ఇళ్ల తలుపులు తట్టింది. మెకానికల్‌గా ఇళ్లలో ఒకదాని తర్వాత ఒకటిగా తలుపులు తెరుచుకున్నాయి. ఒక్కో ఇంట్లోంచి ఓ తల్లి - వేలు పట్టుకుని ఓ అమ్మాయి (12 -14 సంవత్సరాల వయసుతో) నడుచుకుంటూ దగ్గర్లో వున్న టీ కొట్టు వద్దకు వచ్చారు. వాళ్లను చూస్తుంటే ఓ ఫ్యాషన్ పరేడ్ చూస్తున్నట్లుగా వుంది.

ఈ బ్రోకర్ మళ్లీ వచ్చి కారు ముందు సీట్లో కూర్చుంది.

"ఇంతకీ ఎవర్ని సెలెక్ట్ చేశారు" అంది.

ఆ సీను చూస్తున్న నాకు కడుపు తరుక్కుపోయింది.

"ఎవర్నో ఒకర్ని తీసుకురా" అన్నాను.

ఉడుక్కుంటూ వెళ్లిపోయింది.

ఓ అమ్మాయిని తీసుకొచ్చింది.

కొంత దూరంలో కారాపి డ్రైవర్ని పొమ్మన్నాను. అమ్మాయిని ప్రశ్నించాను. ఊరు - పేరు అవీ- కోస్తా జిల్లాలో ఓ చిన్న పల్లెటూరు. పేరు చెప్పింది. తల్లి కూడా 'అలాంటిదే'నని చెప్పింది.

వయసయిపోయిన తల్లి కుటుంబ పోషణకోసం ఇంకా మొటిమలు మొలిచే వయసైనా రాని తనని విపణి వీధిలో పెట్టింది.

ఇంకా వినడం ఇష్టం లేక ఆ అమ్మాయి అడిగినంత డబ్బిచ్చి వెళ్లమన్నాను.

"ఏం సార్! నేను నచ్చలేదా. నేనేమన్నా తప్పు చేశానా?..." అంది భయంగా ఆ పాప.

"కాదు - నీ వేం తప్పు చేయలేదు" అంటూ ఆపుకోలేని దుఃఖాన్ని గొంతులో నొక్కి పెట్టి డబ్బిచ్చి పంపాను.

ప్రొఫెసర్ వరదరాజన్ మరో సంఘటన చెప్పాడు.

ఓ కాన్వెంట్‌లో ఎనిమిదో తరగతి చదివే అమ్మాయిని కన్సల్టింగ్ కోసం ప్రొఫెసర్ వద్దకు తీసుకొచ్చారు.

మొదట్లో బెరుగ్గా వున్నా కొంచెం సేపు తరువాత ఫ్రీగా మాట్లాడింది.

"తను పెద్దమనిషి అయి ఓ సంవత్సరం అయిందట.

చాలా రోజుల్నుంచీ తన గురించి అమ్మా నాన్నా ఏదో మాట్లాడుకునేవారు. కొన్ని సార్లు గొడవ కూడా పడేవారు.

ఓ రోజు రాత్రి 10.00 గంటలకు వాళ్ల గదిలోకి పిలిచి చక్కగా ముస్తాబు చేశారు.

ఉన్న బట్టల్లో మంచి జత బట్టలు వేశారు.

నన్ను మా నాన్న ఎక్కడికో తీసుకెళ్తున్నారు. అప్పుడు అడిగాను.

'నాన్నా! మనమెక్కడికి వెళ్తున్నాం?'

"మనమా! ఓ అంకుల్ దగ్గరకు వెళ్తున్నాం తల్లీ! ఈ రాత్రి నువ్వు అక్కడే వుండాలి. అంకుల్ని బాగా చూసుకోవాలి. అంకుల్ ఎలా చెబితే అలా వినాలి. చెప్పిందల్లా చేయాలి. ఏదైనా సరే. సరేనా... అలా చేస్తే అంకుల్ మనకు ముప్పయ్ వేలరూపాయలు యిస్తాడు. మన అప్పులన్నీ తీరిపోతాయి. మనం ఎంచక్కా హాయిగా వుండొచ్చు."

"మరి నాకు పట్టులంగా కొనిస్తావా!" అంది అమాయకంగా. అభం శుభం తెలీని ఆ పిల్ల.

"దాందేముందమ్మా - అలాగే కొనిస్తా" అన్నాడు.

నాకు ఎక్కడలేని ఆనందం కలిగింది.

ఓ అంకుల్ దగ్గరకు వెళ్లాము. ఆయన్ను నేను ఇంతకు ముందు ఎక్కడో చూసినట్టు గుర్తు. చాలా కష్టపడితేకాని గుర్తు రాలేదు. బహుశా సినిమా డైరక్టరనుకుంటాను.

నాన్న నన్ను వదిలి పెట్టి వెళ్లాడు.

వాడు నా బట్టలన్నీ విప్పాడు. ఏమేమో చేశాడు.

నాకేమో అసహ్యంగా వుంది. తెల్లవారి లేచే సరికి ఒళ్లంతా నొప్పులు. ఏం జరిగిందో తెలీదు.

అప్పట్నుంచి పగలు బడికి – రాత్రి తండ్రి ఎక్కడికి తీసుకెళ్తే అక్కడికి వెళ్లడం.

ఆఖరికి ఇలా తయారయ్యింది నా బతుకు – "అంటూ దుఃఖాన్ని దిగమింగుకుంటూ చెప్పింది.

ఆ బాలిక దైన్యమైన పరిస్థితి వర్ణనాతీతం.

వింటున్న నాకే దుఃఖం ఆగలేదు. ఆ అమ్మాయిని చూస్తే ఏమీ తెలియని పిల్ల. అనుభవాలు – ఎంతో జుగుప్సాకరమైనవి.

"శారీరకంగా జరిగే మార్పులు, సెక్సుగానీ, కనీసం వాళ్లకున్న అవయువాల ప్రాముఖ్యం కూడా తెలేని వయసులోనే...



చిన్న చిన్న అమ్మాయిల్ని రొంపిలోకి దింపడం – చాలా దారుణమైన విషయం.

వ్యవస్థను నిలువునా చీరేయాలన్న కోపం –.

సమూలమైన మార్పు కోసం సరిపడా చేయలేని నిస్సహాయత –

నన్ను నిరంతరం వేధిస్తుంటుంది –" అని బాధ పడ్డాడు ప్రొఫెసర్.